www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 2 సెప్టెంబర్ 2023

5

అన్నమయ్య



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని మాసాపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆంజనేయులకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం గర్వ కారణమని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కె.రామాపురంలోని ఉపాధ్యాయుడికి ఇంటికి వెళ్లి దంపతులను గజమాల వేసి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, రూరల్ అధ్యక్షులు ముడికినాటి వెంకటసుబ్బారెడ్డి రాష్ట్ర పాల ఏకరి కన్వీనర్ శివప్రసాద్ నాయుడు (గుట్టబాబు), రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు గుర్రం సుబ్బయ్య, శివరాం, నారాయణ స్వామి, చంద్ర పాల్గొన్నారు.



ఆంజనేయులు దంపతులను సన్మానిస్తున్న ఆర్‌ఆర్

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం



మదనపల్లె : నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసమే సచివాలయాల్లో వినతి పత్రాలు ఇచ్చినట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు పేర్కొన్నారు. సమరభేరిలో భాగంగా ఆగస్టు 30, 31 తేదీల్లో ప్రజా సమస్యలపై సేకరించిన సంతకాల పత్రాలను శుక్రవారం 1,2,3,4,7 సచివాలయాల్లో అడ్మిన్ వెల్ఫేర్, కౌన్సిలర్లకు ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలపై అనేక భారాలు మోపుతోందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఉన్న చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్‌లు తేవడమేగాక ఉన్న ఉద్యోగాలు తొలగిస్తూ భవిష్యత్‌లో నిరుద్యోగ సమస్యను తీవ్రం చేశారని చెప్పారు. రాష్ట్రాల హక్కులను ఆదాయాలు హరించే విధంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకపోగా సమర్థిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రజల భవిష్యత్ పై ఆందోళనతో సిపిఎం సమరభేరి పేరుతో ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించి ప్రజలను మేలుకొల్పాలని ఆందోళన బాట పట్టిందన్నారు. విద్యుత్, ఆర్‌టిసి, చెత్త, ఇంటి, ఆస్తి పన్నులను రద్దు చేయాలని, నిరుద్యోగభృతి ఇవ్వాలని, పరిశ్రమలు నెలకొల్పాలని, మౌలిక వసతులైన సిసి రోడ్లు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు, ఇళ్ల నిర్మాణాలు, డ్రైనేజీ కాల్వల వంటి సమస్యలను అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. 4న మండల కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఫయాజ్, మాధవయ్య, శేఖర్‌నాయక్, ఓబులేసు, ఈశ్వరయ్య, హసేన్, సలీమ్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం మదనపల్లిలోని పలుసచివాలయాల్లో ప్రజల సంతకాలతోకూడిన వినతిపత్రాలు సమర్పించారు. అధికధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించాలని, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఇచ్చిన వాగ్దానాలను మరిచి ప్రజలపై భారాలు మోపుతున్నాయని తెలిపారు. దేశంలో 10 సంవత్సరాలలో ఎవరు లేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, నిరుద్యోగం 45 శాతం పెరిగిందన్నారు. ఇంటి పన్నులు, చెత్తపన్ను పెంచారని, ప్రజల జీతభత్యాలు మాత్రం పెరగడంలేదని, కనీసవేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. మదనపల్లి శివారు ప్రాంతాల్లో మురికికాల్వలు అధ్వాన్నంగా ఉన్నాయని, చాలాచోట్ల మంచినీరు అందడంలేదని, రోడ్ల పరిస్థితి మరీ అధ్వాన్నమైందని, శాంతిభద్రతలు క్షీణించాయని వాపోయారు. చేనేతకార్మికులు,చేతివృత్తులవారి జీవితాలు బజారున పడ్డాయని, ఆటోకార్మికులు, టాక్సీడ్రైవర్లు పలు బాధలు పడుతున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి కార్పొరేట్లు సేవ చేసే ప్రభుత్వానికి ప్రజా సేవలో శ్రద్ధలేదన్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లుతెరచి అందరినీ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, జయరాం, రఘునాథ్, నాయుడన్న సుందరం, శివ, పవన్ పాల్గొన్నారు.

టమోటా ధరలు పతనం

- భారీగా తగ్గిన వైనం
- మొదటి రకం కిలో రూ.10-15
- రెండో రకం రూ.5-9
- మొన్నటి వరకు కాసులు..నేడు కన్నీళ్లు
- లబోదిబోమంటున్న రైతులు



మదనపల్లె మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వారం రోజుల వ్యవధిలోనే టమోటా ధరలు భారీగా పతనం అయ్యాయి. ఓడలు బండ్లు అవుతాయి.. బండ్లు ఓడలు అవుతాయని కొందరు అంటుంటారు. ఇది మనుషులకే కాకుండా కూరగాయలకు కూడా వర్తిస్తుందని ప్రస్తుతం కొందరు చర్చించుకుంటున్నారు. మొన్నటి వరకు కాసులు పలికించిన టమోటా.. ఇప్పుడు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. 30 రోజుల కిందటి వరకు కిలో టమోటా రూ.196 పలికింది. ప్రస్తుతం ఒక్కసారిగా టమోటా ధరలు పాతాళానికి పడిపోయాయి. మదనపల్లె మార్కెట్లో కిలో టమోటా కేవలం రూ.9గా పలుకుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. టమోటాలతో కోటీశ్వరులు అయిన కొందరు రైతులను చూసి ఆనందించిన వారికి ఇప్పుడు తాజా పరిస్థితులు ఆవేదనకు గురిచేస్తున్నాయి.

జిల్లాలోని మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌లో టమాటా ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. జూలై 30న మార్కెట్ చరిత్రలోనే కిలో టమాటా అత్యధికంగా రూ.196 పలికిన సంగతి తెలిసిందే. నెల రోజులుగా దిగుబడి పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఏ గ్రేడ్ కిలో టమాటా రూ.10 నుంచి రూ.15, బి గ్రేడ్ రూ.5 నుంచి రూ.9గా ఉంది. సగటున కిలో టమాటా రూ.9 నుంచి రూ.15 ఉంది. జూలై నెలలో కిలో టమోటా ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో రూ.196 అమ్మి టమోటాలను మధ్యతరగతి కుటుంబాలు కొనలేక అవస్థలు పడ్డాడు. రోజు రోజుకు టమోటా దిగుబడి పెరగడం, ఇతర రాష్ట్రాలలో జిల్లాలలో టమోటా పంట సాగు పెరగడంతో రేట్లు తగ్గాయని వ్యాపారస్తులు అంటున్నారు. గురు, శుక్రవారాల్లో మదనపల్లె మార్కెట్ యార్డ్‌లో టమోటా రేట్లు ఈ విధంగా ఉన్నాయి. గురువారం మొదటి రకం 10 కిలోల టమోటా గరిష్టంగా రూ.220 పలకగా కనిష్టంగా రూ.210, రూ.170 పలికింది. రెండవ రకం గరిష్టంగా రూ168 పలకగా కనిష్టంగా రూ.140, రూ.90 పలికింది. 295 మెట్రిక్ టన్నుల టమోటా మార్కెట్‌కు వచ్చింది. శుక్రవారం మొదటి రకం 10 కిలోల టమోటా గరిష్టంగా రూ.220 పలకగా కనిష్టంగా రూ.210, రూ.170 పలికింది. రెండవ రకం గరిష్టంగా రూ168 పలకగా కనిష్టంగా రూ.140, రూ.90 పలికింది. 204 మెట్రిక్ టన్నుల టమోటా మార్కెట్‌కు వచ్చింది. అప్పుల ఊబిలో నుండి బయటపడుతున్న తరుణంలో ఇలా ఒక్కసారిగా రేట్లు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిలకడగా టమోట రేట్లు ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రైతు బాగుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరుసగా ఐదవ ఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా 2023 మే నుండి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల ఖాతాలకు జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు. విసి హాల్ నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పంజం సుకుమార్ రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా బొప్పాయి, అరటి పంటలు సాగు చేశారని, పంట వేసి నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందజేయడంతో రైతులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రైతులు పంట వేసినప్పటినుంచి ధాన్యం ఇంటికి వచ్చేవరకూ ప్రభుత్వం అండగా ఉంటూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని చెప్పారు. రైతు బాగుంటే దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రైతు సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో రైతులకు అధిక నిధులు ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతులు పంట వేసి నష్టపోయినట్లయితే వెంటనే వారికి ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం ఇస్తారని చెప్పారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఇస్తారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఇది రైతుల ప్రభుత్వమని రైతు చల్లగా ఉంటే రాష్ట్ర కూడా అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ఉచిత విద్యుత్తు, ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి రాయితీల ద్వారా రైతులు ఎక్కడ నష్టపోకుండా అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో భూమి ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా అందజేస్తున్నారని తెలిపారు. గతంలో ఎరువులు, విత్తనాలు పురుగు మందులకు మండల కేంద్రాలలో క్యూలు కట్టి సక్రమంగా విత్తనాలు, ఎరువులు రాక ఇబ్బందులు పడే వారని, ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే సబ్సిడీ విత్తనాలు ఇస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు ఇస్తోందన్నారు. రైతులందరూ ప్రభుత్వ సబ్సిడీలను సద్విని యోగం చేసుకొని అభివృద్ధి చెందారన్నారు. జిల్లాలో 1280 మంది కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా కింద రూ. 96 లక్షలు రైతుల ఖాతా లకు జమ చేశారన్నారు. ఖరీఫ్ 2023 మే నుండి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ 1326 మంది రైతులకు రూ.2.12 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేశారని చెప్పారు. జిల్లాలోని 1280 మంది కౌలు రైతులకు వైయస్సార్ రైతు భరోసా కింద మెగా చెక్కు, ఖరీఫ్ 2023 మే నుండి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీకి సంబంధించిన మెగా చెక్కును రైతులకు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ఫయా జ్ బాషా, ఎంపిపి సుదర్శన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జిల్లా ఆర్టికల్చర్ అధికారి రవిచంద్రబాబు పాల్గొన్నారు.



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపకల్పన

- రాజకీయ పార్టీల సమావేశంలో కలెక్టర్ గిరీష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

రాజకీయ పార్టీల సహకారంతో జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ గిరీష తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో ఓటర్ల జాబితాపై , ఇంటింటి పరిశీలన అంశంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తి అయిందన్నారు. సదరు పరిశీలన సమాచారాన్ని ఎప్పటికప్పుడూ రాజకీయ పార్టీలకు అందజేస్తున్నామని చెప్పారు. ఆగస్టు 31 నాటికి జిల్లాలో 13,56,348 మంది ఓటర్లు ఉండగా ఇందులో 13,56,102 మందిని ఇంటింటికి వెళ్లి భౌతికంగా పరిశీలించారన్నారు. బిఎల్‌ఒల యాప్‌లో 13,44,489 మంది నమోదయ్యారని చెప్పారు. బిఎల్‌ఒ యాప్, భౌతిక పరిశీలనకు మధ్య ఉన్న తేడా ఓటర్లను గుర్తించడంలో రాజకీయ పార్టీలు కూడా పూర్తి సహకారం అందించాలని కోరారు. ఇంటింటి పరిశీలనకు వెళ్ళినప్పుడు ఆ ఇంట్లో ఉన్న అన్ని ఓట్లను పరిశీలిస్తున్నామని ఆ ఇంటిలో ఓటరు జాబితాలో పేరు ఉంటుంది కానీ భౌతికంగా మనిషి అక్కడ ఉండరు అలాంటి వాటికి సంబంధించి విచారణ చేసి ఫారం 8లో వివరాలు పొందుతున్నట్లు పేర్కొన్నారు. మృతి చెందిన ఓటర్లు, మార్పులు, తొలగింపులకు సంబంధించి రాజకీయ పార్టీలన్నీ ఇచ్చిన జాబితాలను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతోందన్నారు. గతంలో వారు ఇచ్చిన జాబితా సమాచారం మేరకు పరిశీలన జరిపిన నివేదికను సెప్టెంబర్ 10న అందజేస్తామని చెప్పారు. ఇటీవల రాజకీయ పార్టీకి ఇచ్చిన నూతన జాబితాలకు సంబంధించి పరిశీలన చేయాల్సి ఉందని ఇందుకు కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. మార్పు అయిన ఓట్లకు సంబంధించి ఫారం-8 తప్పని సరిగా పొందాలని విఆర్వోలకు కలెక్టర్ సూచించారు. నూతన ఓటర్లుగా నమోదు కొరకు ఫారం6 లో దాదాపు 15 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని వాటన్నిటిని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఆయా నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశం మినిట్స్‌ను ఎలక్షన్ కమిషన్ సూచించిన నిర్దేశిత ఫార్మేట్ లోనే సమర్పించాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. ఏరోజుకు ఆరోజు అన్ని ఫారాలను తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇంకా ఏమైనా సూచనలు సలహాలు ఉంటే ఇవ్వాలని రాజకీయ పార్టీలను కలెక్టర్ కోరారు. ఇంటింటి వెరిఫికేషన్ లో అందరూ భాగస్వామ్యం అయినప్పుడే మనం తప్పులు లేకుండా ఎన్నికల ఓటర్ల జాబితాను తయారు చేయగలమని రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఇంటింటి పరిశీలనలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు అందించిన సలహాలు సూచనలు కూడా పరిగణలోకి తీసుకొని తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట ఆర్‌డిఒలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, ఆయా నియోజకవర్గాల ఈఆర్వోలు, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల

సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో వెలుగులు

పీలేరు: అర్హులైన పేదల బతుకుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకులారంపల్లి పంచాయతీ, ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక వైసిపి నాయకులుతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి లబ్దిదారులను పలకరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలకు అండగా నిలిచే ప్రభుత్వమన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ లక్ష రూపాయలకు పైగా లబ్ది చేకూరుతోందన్నారు. ప్రతి ఒక్కరి మేలుకోరే జగనన్న ప్రభుత్వం పట్ల సానుకూలంగా ప్రజలు ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, పీలేరు, కాకులారంపల్లి సర్పంచులు డాక్టర్ షేక్ హబీబ్‌బాష, హరణి సురేష్‌రెడ్డి, వైస్ ఎంపిపి హరిత వెంకట రమణ, మండల కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, జివి.రాకేష్‌రెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు మహిత ఆనంద్, ఎఎంసి వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ నాగరాజమ్మ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు సుంకర చక్రధర్, డిప్యూటీ తహశీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ మురళీమోహన్‌రెడ్డి, ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : మాజీ మంత్రి

మదనపల్లె అర్బన్: తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, తెలుగుదేశం జాతీయ అధికార ప్రతినిధి జి.మాల్యాద్రి మదనపల్లి నియోజకవర్గంలో వైసిపి పెట్టిన తప్పుడు కేసులలో ఇబ్బంది పడుతున్న చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్ కుటుంబాన్ని, కోళ్లబైలు పంచాయతీ టిడిని కార్యకర్త జివి నాయుడు కుటుంబాన్ని కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పి అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మీ కుటుంబ పెద్దలు ఎవరైతే వైసిపి పెట్టిన తప్పుడు కేసులకు ఇబ్బంది పడ్డారు వారందరూ హీరోలుగా తిరిగి త్వరలోనే ఇంటికి వస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయులు జునైద్ అక్బరీ, నాగూర్ వల్లి, గిరీష్, రఘుపతి నాయుడు, శ్యామలమ్మ, రాజన్న, రవి, నాయుడు, పూలకుంట్ల హరిబాబు, రాజేష్, మోహన్ నాయుడు, బాలు మరియు ఇతర తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చీనీ కొనుగోలులో సూట్ రద్దుకు ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే

ప్రజాశక్తి సింహాద్రిపురం

చీనీ కాయల కొనుగోలులో సూట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పండే పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చీనీ రైతులు, వ్యాపారస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చీనీ రైతులు సూట్ కారణంగా 25 శాతం వ్యాపారస్తులకు ఉచితంగా ఇవ్వడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీని నిర్మూలనకు నియోజవర్గంలోని చక్రాయపేట మినహా అన్ని మండలాలలోని 15 గ్రామాలను హైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సూటు నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులకు మంచి ధరలు లభించేలా చూస్తామన్నారు. నాణ్యమైన చీనీ కాయలకు మంచి ధరలు లభించేందుకు గ్రేడింగ్ మిషన్ సైతం త్వరలోనే రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. వ్యాపారస్తులు ఎవరైనా సూట్ తీసుకుంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ నెల 10వ తేదీన పులివెందులలో మరోసారి రైతులతో నిర్వహించి చీనీ కాయల కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్‌కు ఘన సన్మానం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండేను గురజాల రైతులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డిడిహెచ్ మైకల్ రాజ్, మార్కెటింగ్ శాఖ జెడి రాజశేఖర్, పులివెందుల, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్లు చిన్నప్ప, రామ మోహన్‌రెడ్డి, ఉద్యాన శాఖ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, పులివెందుల, ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారులు రాఘవేంద్రారెడ్డి, సుకుమార్‌రెడ్డి, ఉద్యాన శాఖ సిబ్బంది వీరారెడ్డి, వైసిపి నాయకులు కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవి, మార్కెటింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రాహుల్ పాండేను సన్మానిస్తున్న గురజాల చీనీ రైతులు

'వృత్తిదారుల బలోపేతానికి విశ్వకర్మ యోజన పథకం'

ప్రజాశక్తి - రాయచోటి

గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ గిరిష పిఎస్ పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పథకం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి అమలు కమిటీ అధికారులతో అవగాహన సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత ఈ పథకంపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 రకాల వృత్తి, హస్త కళాకారుల్లో లబ్ధిదారులను గుర్తించాల్సి ఉందని చెప్పారు. లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై వాలంటీర్లకు శిక్షణ నివ్వాలని తెలిపారు. నైపుణ్య కేంద్రాలనూ గుర్తించాల్సిందిగా సూచించారు. పథకం కింద తొలిదశలో అర్హులైన 18 ఏళ్లు నిండిన సాంప్రదాయ కుల చేతి వృత్తిదారులను, కళాకారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారుల ఆన్‌లైన్ నమోదు అనంతరం వెరిఫికేషన్ చేయాలన్నారు. గ్రామాల్లోని సాంప్రదాయ కుల, హస్త కళాకారులకు నైపుణ్యాభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం, మార్కెట్ అనుసంధానం చేయడం, సామాజిక భద్రత అందించడం ఈ పథకం లక్ష్యమని వివరించారు. ఇందుకోసం సాంప్రదాయ వృత్తి దారుల వ్యాపారాలను బలోపేతం చేసేందుకు 2023-2028 వరకు ఐదు సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేయనుందన్నారు. ఈ పథకం కింద పిఎం విశ్వకర్మ యోజన సర్టిఫికెటును, గుర్తింపు కార్డును అందిస్తారన్నారు. మొదటి దశలో రూ.లక్ష, రెండవ దశలో రూ.2 లక్షల రుణాన్ని 5 శాతం సబ్సిడీ వడ్డీతో మంజూరు చేస్తారని చెప్పారు. ఈ పథకంలో భాగంగా నైపుణ్య శిక్షణ, పనిముట్టులకు సంబంధించి రూ.15 వేలు వరకు ఇన్సెంటివ్ ఇస్తారన్నారు, డిజిటల్ ట్రాన్సాక్షన్, సహాయ సహకారాలను కూడా అందిస్తారన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంలో రెండు రకాల నైపుణ్య శిక్షణలో ఉంటాయని ప్రభుత్వం వెల్లడించిందన్నారు. బేసిక్ నైపుణ్య అభివృద్ధి శిక్షణ, అడ్వాన్స్ నైపుణ్య అభివృద్ధి శిక్షణలు ఉంటాయన్నారు. మొదటి ఏడాది ఎన్నో కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద వడ్రంగులు, పడవల తయారీ దారులు, ఆయుధ, కవచ తయారీ దారులు, కమ్మరులు, పరికరాల తయారీదారులు, తాళాల తయారీ దారులు, బంగారం పనిని చేసేవారు, కుమ్మరులకు సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో డిఐసి జిఎం జె.నాగరాజు, డిఆర్‌డిఎ పీడీ సత్యానారాయణ, ఎల్‌డిఎం వేంకటేశ్వరరెడ్డి, డిపిఒ ధనలక్ష్మి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి మనోహర రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి బి.హరికృష్ణ, జిల్లా చేనేత, జౌళి శాఖా అధికారి, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ ఎస్. సుబ్రమణ్యం, జిల్లా కార్మిక శాఖ అధికారి రంగా రాజు, ఎన్‌ఎసి అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్ పాల్గొన్నారు.

రూ.1.90 కోట్లతో శిల్పారామం

రామాపురం: జిల్లాకు కల్కితురాయిగా బండపల్లి వద్ద శిల్పారామం నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ గిరీష తెలిపారు. శుక్రవారం మండలంలోని బండపల్లిలో 13.90 ఎకరాలలో మొదటి విడత రూ.1.90 కోట్ల నిధులతో చేపట్టిన శిల్పారామం అభివృద్ధి పనులకు కలెక్టర్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని హంగులతో అద్భుతంగా కనువిందు చేసేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. శిల్పారామంలో పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించేలా బండపల్లి శిల్పారామంను తీర్చిదిద్దుతామన్నారు. పట్టణ వాసులకు పల్లె వాతావరణాన్ని అందించడంతోపాటు విలాసవంతమైన సౌకర్యాలను కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పల్లె జీవనం, కులవృత్తులు, వ్యవసాయం, గత చరిత్రను కళ్లకు కట్టేలా రకరకాల శిల్పాలు ఇక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పర్యాటక, సంస్కృతి శాఖ, రెవెన్యూ, మున్సిపల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు గద్దర్ సంస్మరణ సభ

మదనపల్లె అర్బన్: ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు పుంగనూరులోని అంబేడ్కర్ భవన్‌లో ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక బాస్ కార్యాలయంలో గద్దర్ సంస్మరణ సభ కరపత్రాలను నాయకులు నీరుగట్టి రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, రాయల్ సూర్య తదితరులతో కలిసి ముత్యాల మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తన ఆట, పాట, మాటలతో ఆకలి, అవమానం, అసమానతలపై యుద్ధం చేసిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న అని కొనియాడారు. గద్దరన్న అమరుడు కావడం ప్రజా పోరాటాలకు తీరనిలోటని చెప్పారు. గద్దర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాడానికి ప్రపంచ వ్యాప్తంగా ఆయన సంస్మరణ సభలు జరుగుతున్నాయన్నారు. చిత్తూరు పార్లమెంటు సభ్యుడు ఎన్.రెడ్డెప్ప నేతృత్వంలో, బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సభకు, గద్దర్ అభిమానులు, కళాకారులు, కవులు, రచయితలు, మేధావులు, ప్రగతిశీల సంస్థల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని అయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాస్ నాయకులు తలారి కృష్ణ, బండకోట రవి, భార్గవ్, హైదర్, నరేష్, రవి, జీవన్, నరసింహులు, సందీప్ పాల్గొన్నారు.



గద్దర్ సంస్మరణ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆశ్రమ బాలలతో జనసేన నాయకులు

బాలలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక బర్మావీధిలోని మదనపల్లె చైతన్య అనాధ ఆశ్రమంలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ముందస్తు పుట్టిన రోజు వేడుకలను జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలోని పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రాందాస్ చౌదరి మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చెప్పినట్లు ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో జనసేన పార్టీ ఆవిర్భవించిందన్నారు. పవన్ చెప్పినట్లు పది మందికి సాయం చేసే విధంగా కార్యక్రమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, మదనపల్లి రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, రాష్ట్ర చేనేత విభాగ నాయకులు సురేంద్ర, ఐటి విభాగ నాయకులు జగదీష్, ఐటి కో-ఆర్డినేటర్ లక్ష్మినారాయణ, జిల్లా జాయింట్ సెక్రెటరీ సనావుల్లా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని 220కెవి సబ్‌స్టేషన్‌లో కంట్రోల్ ప్యానల్ మార్పు చేయదలచిన కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఎడి ఎం.భాస్కర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1,2 ఫీడర్ పరిధిలోని కోడూరు, మాం గోయార్డ్, జంగిటి వారీపల్లి, సెట్టిగుంట, బొమ్మవరం, సబ్‌స్టేషన్లలో, విపిఆర్ కండ్రిక, అనంత రాజుపేట, బుడుగుంటపల్లి, నాగవరం, తూరుపుపల్లి, వివి కండ్రిగలోని సబ్ స్టేషన్లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలంతా గమనించి సహకరించాలని కోరారు.



విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేస్తున్న డివైఇఒ జి.క్రిష్ణప్ప

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేయాలని మదనపల్లి డివైఇఒ జి.క్రిష్ణప్ప సూచించారు. శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, టీచింగ్‌డైరీ, టీచింగ్ నోటు పుస్తకాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థుల ప్రగతిని తానే స్వయంగా తరగతిలోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్-స్వచ్ఛ పఖ్వాడా మిషన్‌లో భాగంగా విద్యార్థులందరి చేత ప్రతిజ్ఞను చేయించి, పరిశుభ్రత ఆవశ్యకతను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల్లో అద్భుతమైన విద్యాబోధన జరుగుతోందని, వచ్చే ఏడాది పదవ తరగతిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని చెప్పారు. పాఠశాలలో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తు న్నారని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శీనునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు పూర్తి చేసి నీరందిస్తాం

ప్రజాశక్తి-గాలివీడు

వెలిగల్లు ప్రాజెక్టు కింద ఎడమ కాలువకు మరమ్మతులు పూర్తి చేసి నీటిని విడుదల చేస్తామని డిఇ శిరీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతోమాట్లాడుతూ వెలిగల్లు ప్రాజెక్టు ఎడమ కాలువ ఆరు కిలోమీటర్ల మేర జమ్ము, మట్టితో నిండిపోయిందన్నారు. జెసిబి యంత్రాలను తీసుకెళ్లేందుకు కూడా ఇబ్బందికరంగా ఉందని, రెండు మూడురోజుల్లో కాలువ పనులకు మరమ్మతులు చేసి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఇప్పటికే ఇఇలు పనులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని సోంపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పై ప్రజలకు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిలువ లేకుండా చేయాలన్నారు. నూతన గృహాలు నిర్మాణ దశలో ఉన్నందున, నీటి కొరత ఉన్నందున మూతలు లేని డ్రమ్ములందు ఎక్కువ రోజులు నీటి నిల్వ ఉన్న కారణంగా దోమలు వృద్ధి చెందుతున్న తెలిపారు. అదేవిధంగా ఎఎన్ఎం లు వెక్టార్ కంట్రోల్ హై జాన్ యాప్ లో ఫోటోలు అలస్యం చేయకుండా అప్లోడ్ చేయాలని సూచించారు. ఆశ వర్కర్లు ఫీవర్ సర్వే యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించి దోమల లార్వా దశలోనే నాశనం చేయడంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రజలు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలన్నారు.ఈ కార్యక్రమము లో ఆరోగ్య కార్య కర్తలు శైలజ,ఆశాలు,మహబూబ్ జాన్,ఎంఎల్‌పిహెచ్ గౌసియా పాల్గొన్నారు.



దోమల నివారణకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆదాయ వనరులుగా సహకార బ్యాంకులు : సిఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

జిల్లా సహకార బ్యాంకులను ఆదాయ వనరులుగా ప్రజలు ఎంచుకోవాలని నిమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ సిఇఒ హరినాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజలతో, రైతులతో, బ్యాంకు ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. 'ఆర్థిక అక్షరాస్యత-బ్యాంకుల వినియోగంపై అవగాహన అనే అంశంపై ఎం.వి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం ద్వారా ఆట, పాటలతో, వినోద విజ్ఞానంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాబార్డ్ వారి సహకారంతో దిచిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకు ఖాతాదారులకు బ్యాంకు లోని పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులో ఖాతాను కలిగిన వారు కేవలం లావాదేవీలే కాకుండా, బ్యాంకులను ఇతర ఆదాయ వనరులుగా ఉపయోగించుకోవాలని అవగాహన కల్పించామన్నారు. సహకార బ్యాంకు ద్వారా బంగారు నగలపై రుణ సదుపాయం, బంగారంపై వ్యవసాయ, వ్యవసాయేతర వంటి అనేక విధమైన రుణ సదుపాయాలు, కేంద్ర పథకాలు, ఇన్సూరెన్స్‌లను అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు క్రాప్ లోన్, మహిళలకు పొదుపుపై రుణ సదుపాయం, సామాజిక భద్రత పథకాలు కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్ ల సదుపాయం అందుబాటులో ఉన్నాయన్నారు. ఖాతాదారులకు సేవింగ్ అకౌంట్, ఆర్‌డి, ఆర్ఐపి, ఎఫ్‌డిలపై అధిక వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. ఖాతాదారులు, రైతులు, మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి, వ్యాపార, వ్యవసాయ సౌలభ్యానికి సహకార బ్యాంకులలోని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నిమ్మన పల్లి సహకార బ్యాంకు సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, ధనంజయ, ఎం.వి రూరల్ కళాజాత బృందం సభ్యులు విజయ్ మెజీషియన్, ఆనంద్ సింగర్, చిరంజీవి డప్పు కళాకారులు, రైతులు, పొదుపు మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



బ్యాంకు పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

జోరుగా కర్ణాటక మద్యం అమ్మకాలు

మండల సమావేశంలో ఎస్ఇబి సిఐని నిలదీసిన ప్రజాప్రతినిధులు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇబి సిఐ మల్లిక

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని ఊరూరా కర్ణాటక మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని మండల సర్వసభ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు ఎస్ఇబి అధికారులను నిలదీశారు. శుక్రవారం ఎంపిపి సాయి లీలా అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఇబి విభాగానికి సంబంధించి వివరాలను సిఐ మల్లిక తెలిపారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో బెల్టుషాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ములకలచెరువు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎస్ఇబి పోలీసులు వారిని ప్రోత్సహిస్తున్నట్లు సర్పంచి రాంబాబు, ఎంపీటిసి ఆయేషా చాంద్‌బాషా పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల తమ మాట వినలేదని తమపై ఆరోపణలు చేస్తున్నారని సిఐ సభలో పేర్కొనడంతో కొద్దిసేపు ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఎంపిడిఒ మాట్లా డుతూ ప్రజాప్రతినిధలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ప్రజాప్రతినిధుల అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సిఐకు సూచించారు. అనంతరం సిఐ మాట్లాడుతూ మండలంలో కర్ణాటక మద్యం అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన శాఖల వారికి ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గౌరి శంకర్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చనిసురేంద్ర, ఎంపిపి సాయిలీలా, ఎంపిడిఒఅశ్వని, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి

ప్రజాశక్తి-వీరబల్లి

15 రోజులుగా కొనసాగుతున్న విద్యుత్ కోతలతో తాము సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలంలోని ఆయా గ్రామాల రైతులు శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. గొల్లపల్లి, పెద్దూర్‌కస్పా, పెద్దమాదిపల్లి, సాకలపల్లి, వనంకాడపల్లి, రామన్నవారిపల్లి, టెంకాయ చెట్లపల్లి, దుగనపల్లి, నాగిరెడ్డిగారిపల్లి, ఆర్ఎంరెడ్డిగారిపల్లి, రాచపల్లి, గుట్టకింద, కళ్ళే వాళ్ళపల్లి, నాయనవారిపల్లి, గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ గత 15 రోజుల నుంచి విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాము సాగు చేసిన ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. స్పందించిన ఎలక్ట్రికల్ ఎడిఇ రామచంద్రారెడ్డి స్పందించి మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో విద్యుత్ కోతలు రావడం నిజమే అన్నారు. ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు విద్యుత్ కోత రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, కోటయ్య, అహ్మద్‌బాషా, వెంకటరామరాజు, సహదేవ, నారా యణరెడ్డి, రవీంద్రారెడ్డి, ఆంజనేయరెడ్డి, శ్రీధర్ రెడ్డి, గౌస్‌మోదీన్, రైతులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

పోషకాహారంతో తల్లీబిడ్డ భద్రం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

తల్లీబిడ్డ ఆరోగ్యానికి పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని ఎంపిహెచ్ఒ మణి , అంగన్వాడీ కార్యకర్త ఆయేషా శుక్రవారం చింతకుంట వాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో జాతీయ పోషక వారోత్సవాలలో భాగంగా తల్లి దండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహార లోపంతో ఏటా తల్లీబిడ్డల మరణాలు సంభవిస్తాయని అన్నారు. దీనిని అధిగమించడంతో పాటు పోషకాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏటా సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జాతీయ పౌష్టికాహార వారోత్స వాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలి కలకు పోషకాహార అవశ్య కతను వివరిం చారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు గల ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవచ్చని వైద్య సిబ్బంది , ఐసిడిఎస్ అధికారులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ విద్యార్థులు, తల్లిదండ్రులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-పుల్లంపేట

సైబర్ కేటుగాళ్లు కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, కొత్తగా ఎల్ఐసి బోనస్ డబ్బుల పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని ఎస్ఐ రఘురాం తెలిపారు. తెలియని మొబైల్ నెంబర్స్ నుంచి మీరు ఎల్ఐసి కంపెనీ అందించే అదనపు బోనస్ కు ఎంపికయ్యారని మొబైల్ ఫోన్లకు లింకులు పంపిస్తున్నారని, ఆ తర్వాత ఫోన్ చేసి స్థానిక భాషలో మాట్లాడుతూ మాయమాటలు చెప్పి తాము పంపించిన లింకును ఓపెన్ చేసి డబ్బులను చెక్ చేసుకోవాలంటూ నమ్మిస్తారని, ఆ మెసేజ్ లో ఉన్న లింక్ ని క్లిక్ చేసి మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా నెంబర్లు, పాస్ వార్డులు, ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్లు వాటి సహాయంతో మీ అకౌంట్లో ఎంత ఉంటే అంత లూటీ చేస్తున్నారని చెప్పారు. ఆ తర్వాత బాధితులు తిరిగి కాల్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తు న్నాయని, మీ వ్యక్తిగత సమాచారం వారి వద్ద భద్రపరుచుకుని ఇతర నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఎల్ఐసి బోనస్ డబ్బులు వచ్చాయంటూ వచ్చే లింక్‌ను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దని ఎస్ఐ మండల ప్రజలకు సూచించారు. ఎవరైనా ఈ విధంగా మోసపోయినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ రఘురాం

బి-సర్టిఫికెట్ పరీక్షల్లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి విభాగంలో 34 మంది క్యాడెట్స్ బి సర్టిఫికెట్ పరీక్షలలో ఉతీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. 35 ఆంధ్ర బెట్టాలియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలలో 34 మంది క్యాడెట్స్ హాజరుకాగా వంద శాతం ఉతీర్ణత సాధించినట్లు ఆయన అన్నారు. ఇందులో 27 మంది క్యాడెట్స్ కు ఎ గ్రేడ్ గాను, ఏడు మందికి బి-గ్రేడ్ గా ఉతీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్,ఎన్‌సిసి లెఫ్టనెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ అభినందనలు తెలిపారు.

మారిన విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫోన్ నంబర్లు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని రెడ్డివారి పల్లి, వెంగంవారి పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లకు నూతన ఫోన్ నెంబర్లను కేటాయించినట్లు విద్యుత్ శాఖ ఎఇఇ వసంతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డివారిపల్లి, వెంగంవారిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ల వద్ద గతంలో ఉన్న ఫోన్ నెంబర్లకు మొబైల్ నెట్‌వర్క్ సమస్యతో రైతులు విద్యుత్ సమాచారానికై సంప్రదించా లంటే ఇబ్బందులు పడుతూ ఉండేవారని అన్నారు. ఈ సమస్య పరిష్కారంలో భాగంగా రెడ్డివారిపల్లికు 87126 25791, వెంగంవారిపల్లెకు87126 25792 ఫోన్ నెంబర్లను కేటాయించినట్లు తెలిపారు. రైతులు ఈ మార్పును గమనించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సమాచారానికై పైన తెలిపిన నూతన ఫోన్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నూతన పింఛన్లు మంజూరు

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామపంచాయతీలో డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన పెన్షన్లను శుక్రవారం మండల కన్వీనర్ గ్రామ ఉపసర్పంచ్ సయ్యద్ ముస్తాక్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. పెన్షన్ల నెలకి మందులు, నిత్యవసర సరుకులు తెచ్చుకోవడానికి కొంచెం వీలుగా ఉంటుందని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తెలిపారు.

పశు వైద్యాధికారిగా విజయభాస్కరరావు బాధ్యతలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పశు వైద్యాధికారిగా డాక్టర్ విజయభాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సహాయ పశువైద్య సంచాలకులు, తాడేపల్లిగూడెం నుంచి పదోన్నతి పై ఉపసంచాలకులుగా రాజంపేట పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయ నను సహాయ సంచాలకులు కే.ప్రతాప్, సురేష్ రాజు, డివిజన్ పరిధిలోని పశు వైద్యాధి.కారులు శాలువాతో సన్మానించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పశు సంతతి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



పశువైద్యాధికారి విజయ్‌భాస్కర్‌రావును సన్మానిస్తున్న సిబ్బంది



ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి కె.లత

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నందలూరు

జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత పేర్కొన్నారు.ఈనెల 9న జరగబోవు జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి శుక్రవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ కోర్టు వద్ద నుంచి బస్టాండ్ కూడలి కొనసాగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షీ దారులు రాజీ మార్గంలో తమ సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. కార్య క్రమంలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది,కక్షిదారులు పాల్గొన్నారు.



డ్రైయినేజీ సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ మనోహర్

డ్రైయినేజీ సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీలో డ్రైయినేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం మేనేజరుతో కలిసి పట్టణంలోని బైపాస్ రోడ్డు, దిగువ బస్టాండు ప్రాంతాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పంచాయతీ కమిషనరుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యంగా మురుగునీటి కాలువల మరమ్మతులు, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీలను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సుకు తొలి ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే నేరుగా నగర పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చుని తెలిపారు. అంతేకాకుండా పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ఇందులో ప్రజలను సైతం భాగస్వాములు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స చేయించుకున్న వృద్ధులు

ఉచిత నేత్ర శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆరవ రోజు ఉచిత నేత్ర శిబిరానికి విశేష స్పందన రావడంతో కంటి శస్త్ర చికిత్సకు ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గత ఆరు రోజు లుగా జరుగుతున్న ఉచిత నేత్ర శిబిరంలో రోజుకి 60 మంది చొప్పున శస్త్ర చికిత్సలు నిర్వహి స్తున్నారు.ఈనెల 5 వరకు శస్త్ర చికిత్సలు కొనసాగనుండగా వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు వసతి విషయంలో రాజీ పడకుండా జడ్పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఆయన సోదరుడు అనిల్‌కుమార్‌రెడ్డి వసతులు కల్పించారు. ప్రజలకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యా హ్నం భోజనం, రాత్రి వసతి, భోజనాలు ఏర్పాటు చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు

ప్రజాశక్తి-నందలూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేయ డం జరుగుతుందని నాగిరె డ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నాగి రెడ్డిపల్లి మేజర్ గ్రామపం చాయతీలో మూడు సచివాలయాల పరిధిలో దాదాపు 24 నూతన పెన్షన్లు మంజూరయ్యాయని అన్నారు. వికలాంగ, వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళల పింఛన్లను లబ్ధిదారులకు సర్పంచ్ జంబు సూర్యనారాయణ చేతుల మీదుగా అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అధికారులు, వాలంటీర్లు, వార్డుసభ్యురాలు ఎముక లక్ష్మీదేవి, వైసిపి నాయకులు ఆకేపాటిరమేష్ రెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్లను అందిస్తున్న సర్పంచ్

ఘనంగా పాలేటమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక మండలంలోని పారపట్ల గ్రామపంచాయతీ కురవపల్లిలో పాలేటమ్మ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించినట్లు గుడి ధర్మకర్త కెంగన కల్పనా ప్రసాద్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం రాత్రి 9 గంటలకు అమ్మవారి విగ్రహ ఊరేగింపు చేశారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారి విగ్రహ ఆలయ ప్రవేశం, మృత్యుం గ్రహణము, గణపతి పూజ, వరుణ వాస్తు పూజ, స్వస్తి పునాహ వాచనము, కంకణ ధారణ, అంకురార్పణ హారతి జరిగినట్లు, చెప్పారు. దర్పణ దర్శనము, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీ వద్ద అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కాట్లటపల్లి గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి(48)ని జగన్‌కాలనీ శివారు ప్రాంతంలో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడని చెప్పారు. మృతుడి కుమారు గత మార్చి 21న ఉరివేసుకొని మృతి చెందగా, భార్య రమణమ్మ ఆగస్టులో ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సొంత ఊరు కట్లాటపల్లి అని జగనన్న కాలనీలో బాడుగ ఇంట్లో నివాసముంటున్నాడని తెలిపారు. మదనపల్లె రూరల్ సిఐ సత్యనా రాయణ, ఎస్ఐలు వెంకటేష్, సుధాకర్‌లతో పాటు క్లూస్ టీం ఘటన స్థలాన్ని పరిశీలించారు.ఓబుల్‌రెడ్డిని ఎవరో బండరాళ్లతో తల పగులగొట్టి హత్య చేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారని, హత్యకు గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలుస్తాయని చెప్పారు.